తెలుగు భాష ఎలా వుంటుందో తెలుసుకోవాలంటే కుటుంబాలలోని ఆడవాళ్ళతో మాట్లాడితే తెలుస్తుంది అని ఒకప్పుడు అనుకునేవాళ్ళం ఇప్పుడంతా యిళ్ళలో భార్యాభర్తలూ పిల్లలతో మాట్లాడ్డం అంతా యింగ్లీషులోనే - తెలుగు కుర్రాళ్ళూ తెలుగు ఆడపిల్లలూ ప్రేమలేఖల్ని కూడా ఇంగ్లీషు లోనో హిందీలోనో రాసుకునే పిదపకాలం వచ్చేసింది. ఏవీ లేకపోయినా దసరా మామూళ్ళు మాత్రం నిలబడిగోకేస్తున్నాయ్ జనాన్ని.

లండన్లో ఆర్నెల్లయి ఏదో వుద్యోగం చేస్తున్న కుర్రాడు గోంగూర పచ్చడి వడ్డిస్తే దాన్నేవంటారు తెలుగులో, నాకు గుర్తులేదు అన్నాడ్ట అలాటి వెధవల్ని నాలిక చీరేసి గోతిలో కప్పెయ్యాలంటారు డాక్టరు గూటాలకృష్ణమూర్తిగారు. ఇంగ్లీషు వాళ్ళకి 'కేష్' అనే 'కాసు' (.... యిచ్చాంట మనం 'కేష్' 'కాసు' లోంచి వచ్చివుండవచ్చునట.)

దసరా పజ్యాలు వెళ్ళిపోయాయి. దసరా విల్లంబులు పట్టడం. గిలకలు పట్టడం వీధిలో కోలాటాలు అన్నీ వెళ్ళిపోయి బోయీల్లేని పల్లకీలా మిగిలిపోయాం. విశ్వనాథవారిచేత ఇంకా తిట్లు తినదగిన స్థాయిలోనే వుంది మన సమాజం-వేయి పడగలు - జిందాబాద్;

# సంత్ శ్రీ అకాల్!

**ము**ప్పైరెండేళ్ళ క్రితం - అంటే 1952లో మధ్య ప్రదేశ్‌లో 'గోండియా - జబల్పూర్' నేరోగేజ్ లైన్లో 'నైన్‌పూర్' అనే రైల్వేజంక్షన్ వూళ్ళో డి.టి.యస్. ఆఫీసులో మావారు ఓం ప్రథమంగా రికార్డు గుమస్తాగా నూట అయిదురూపాయల జీతం మీద బి.యన్.ఆర్.లో ఉద్యోగానికి దిగారు. ఆ నైన్‌పూర్ ఎలాటిదంటే అక్కడ రైల్వేక్వార్టర్సు తప్ప ప్రయివేటుగా అద్దెకు యిళ్ళు దొరకవుగాక దొరకవు. ఆ వూరికంతటికీ వో బజారు, మట్టిరోడ్డుతో - ఆపైన సంత పాకల్నీ వూరునీ చీలుస్తూ మాండలా వెళ్ళే బస్సు రూటు - సమీపంలోని ఏటిమీద వో సిమెంటు వంతెన - దేహాతీజనం, చిల్లర వ్యాపారస్థులు, కొన్ని సింధీ కొట్లూ - అవన్నీ యిప్పుడు గుర్తుచేసుకుంటూ వుంటే అట్టలు చిరిగిన పాత పుస్తకం కనిపిస్తే, హఠాత్తుగా చూస్తూన్నట్లువుంటుంది. వర్షం తగులుకుంటే ఓ వారం రోజులు భోరున అలా ఎవరో ఏడుస్తున్నట్లు పడేది. ఎండాకాలం కూడా దారుణంగా వుండేది. ఇక శీతాకాలం కోత పెట్టే చలి ఆ వూరికల్లా ఒక పంపుల చెరువు, లోకో షెడ్డు, రైల్వే యినిస్టిట్యూట్‌లు రెండూ, ఓ గురుద్వారా - అమ్మయ్య గురుద్వారా గురించి చెప్పడానికి యింత భోగట్టా ఏకరువు పెట్టాల్సి వచ్చింది.

నైన్ పూర్ రైల్వేస్టేషన్లో ఎవరుదిగినా, రైల్వే కూలీ నెత్తిమీదో, ట్రాలీ మీదో సామాన్లు వేసి అర్ధరాత్రయినా అపరాత్రయినా నడుచుకుంటూ ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళవలసిందే. వాహనాలు

లేవు రిక్షాలు, ఎద్దుబళ్ళు, ఒంటెద్దుబళ్ళు, డబల్ బుల్లక్ కార్టులు, జట్కాలు, టాంగాలు - ఏవీ లేవు. ఎక్కడ చూసినా కాంగ్రెసు జెండాలు ఎగుర్తూండేవి చాలామంది ఖద్దరే కట్టేవారు. స్థానికులు విధిగా టోపీధరించేవారు. ఆ వూరు వారంతా రైల్వే కాలనీ మీద ఆధారపడి వున్నట్లు కనిపించేది. ఆ వూళ్ళో చాలామంది నాయిూలూ వగైరాలు టైలర్లు కూడా తెల్లగా శుభ్రంగా వుండేవారు. నల్లనివాళ్ళూ పద్మ నయనమ్ములవాళ్ళూ వుంటే రైల్వే కాలనీల్లో వుండేవారు. బెంగాలీ వాళ్ళు, తెలుగువాళ్ళు, మరాఠీలు, సర్దార్జీలు, మిగతా జాతులవాళ్ళూ యింతమందితో కలిసి మెలిసి జీవించడం వల్ల మాకు ఆంధ్రలో అప్పుడు వుండే సంకుల తత్వాల బురద అంటలేదు. మలినం అంటని మల్లిపువ్వులాగా మా మనసు (లు) స్వచ్ఛంగా నిర్మలంగా వుండేవి.

ఇంతకీ నా ఉపక్రమణిక అంతా మా గురుద్వారా జీవితం గురించి చెప్పాలనే, అక్కడ కొన్ని రూల్సున్నాయి. అన్నిటి కన్నా ముఖ్యమైనది సిగరెట్లు కాల్చకూడదు - అంటే నేను కాదు. మావారూ, వారి ఫ్రండ్సూ గట్రా. సర్దార్జీలు, సర్దారిణీలూ, వాళ్ళ పిల్లలూ, వారి ఆచార వ్యవహారాలూ గురుగ్రంథ సాహిబ్ పఠనం, పూజలూ, లంగర్లూ (సాముూహిక భోజనాలు) మాకు చిత్రంగా కొత్తగా ఆశ్చర్యంగా వుండేవి. వాళ్ళు బట్టలు చాలా మంచివి శుభ్రంగా ధరించేవాళ్ళు. ఆడా-మగా వొళ్ళొంచి కష్టపడి పనిచేసే వాళ్ళు. ఇంటి పనులూ సొంత పనులూ అన్నీ వాళ్ళే చేసుకునేవారు. సర్దార్జీలు ఎవరూ దుర్వ్యసనాల జోలికి పోయేవారు కాదు. టిప్‌టాప్‌గా చాలా దర్జాగా వుండేవాళ్ళు.

అయితే - మనం ఆడపిల్లలకే తలంట్లోసి, జడలేసి శుభ్రంగా చక్కగా నీటుగా అట్టే పెట్టడానికి సతమతమయిపోతూ వుంటే వాళ్ళు మగాళ్ళు కూడా జుట్టూ, గడ్డం, మీసాలూ దువ్వుకుని వాటికి రిబ్బన్లలా పెద్ద పెద్ద పట్టీలు బిగించి మళ్ళీ రంగు రంగుల తలపాగాలు చుట్టి డ్రెస్సప్ కావడానికి చాలా టైమ్ పట్టేది. ఆ రోజుల్లో చాలా మంది యిళ్ళలో, ఎక్కడోగాని రేడియోలు లేవు. సర్దార్జీలు చాలామంది లోకోషెడ్డుల్లోనూ, మెకానికల్ - ఇంజనీరింగు డిపార్టుమెంటులో వుండేవారు. వారికి కోపం తెప్పించకపోతే, వారంత సాధుస్వభావులు, మంచివాళ్ళు మరిలేరు.

కాని, మనవాళ్ళు అస్తమానూ సర్దార్జీ జోక్స్ అంటూ వున్నవీ లేనివీ కల్పించి వాళ్ళమీద (బారాబజే జోక్) దగ్గర్నుంచీ రకరకాలవి చెప్పుకుని నవ్వుకుంటూ వుండేవాళ్ళు. కాని వాళ్ళు చాలామంది ఈ జోక్స్‌ని పట్టించుగునేవాళ్ళు కాదు. ఇంటి దగ్గర సర్దార్జీలు ఒకే కాళ్ళను పట్టేసే పైన వదులుగావుండే లాగూ, బనీనూ దానిమీద తోలుక్రాసు పటకాకివేలాడే 'ఖుక్రీ' అంటే కత్తితో వుండేవాళ్ళు. పొద్దున్నే పాలకివెళ్ళి పాలు దగ్గరుండి పితికించుకుని తెచ్చుకోవడం వాళ్ళకి అలవాటు. మావారిని కూడా 'శర్మాజీ వురో' అని లేవగొట్టుకుని లాక్కుపోయే వాళ్ళు. పైగా యిూయన దర్జాగా పబ్లిగ్గా సిగరెట్టు కాల్చడానికి వీల్లేదు. రహస్యంగా దొంగతనంగా తలుపులన్నీ వేసుకుని రాత్రుళ్ళు, ఎవ్వరూ రారన్నాక కాల్చుకునేవాళ్ళు. ఏవీలేదు - గురుద్వారా

క్వార్టర్సులో సిగరెట్లు కాలిస్తే యిల్లు కాళీచేసి పొమ్మంటారు. మళ్ళీ యిళ్ళు దొరకవు. 'సంత్ శ్రీ గాళ్' అని అభివందనం చేయడం 'సర్జార్జీ కీ గల్లా' అని పలకరించడం - కొంచెం కొంచెం వాళ్ళు పంజాబీలో మాట్లాడితే మాకు అర్థం అయేది కాని - జవాబు హిందీలోనే చెప్పేసేవాళ్ళం. వాళ్ళ లిపిని 'గురుముఖి' అంటారు. మన సంస్కృతం, హిందీలకు దగ్గిరగానే వుంటుంది. ప్రార్థనలు, భక్తి గీతాలు చాలా శ్రావ్యంగా వుండేవి వినడానికి. వారి గురుభక్తి కూడా ఆశ్చర్యంగా వుండేది.

మనలా వాళ్ళు డబ్బు దుబారా చెయ్యరు. పైస పైస తూచి తూచి ఖర్చుపెడతారు. మనం వాషింగ్‌కీ, గిన్నెలు కడిగింగ్‌కీ, సర్వెంట్సుకి, కూలీలకి ఖర్చుపెట్టినట్లు వాళ్ళు ఖర్చుపెట్టేవాళ్ళు కాదు. దేశ విభజన జరిగాక చాలా కష్ట నష్టాలు భరించి మన సరిహద్దులో రక్షణకోసం ప్రాణాలర్పించిన వీరులుగా, సింహాలుగా వారికి మా మన్నన గౌరవాభిమానాలు ఎప్పుడూ వుండేవి.

ఇలా వుండగా మేము ఒకసారి శిక్కులలో అకాలీలను చూశాము. వారి స్త్రీలు ఆబాలగోపాలం అంతా 'ఖుక్రీ'లను ధరిస్తారు. నీలం డ్రెస్సులు, తలపాగాలు ధరిస్తారు. ఈ శిక్కులు మతపరంగా యింకా తీవ్రవాదులు మొదట్నుంచీ. వీరి గురించి ఒక కథ వుంది - అది ఏమిటంటే -

ఒక అకాలీ శిక్కుగారు ఏనుగు మీద మరో వూరికి బయల్దేరాడు. ఆ పక్కవూళ్ళో గురుద్వారాకి 'సవాలాఖ్ శిక్కు' వస్తున్నారని కబురెళ్ళింది. వాళ్ళు లక్షా పాతిక వేల మందికి లంగరు (భోజన సదుపాయాలు) చేయడం ఎలాగా అని సతమతమైపోతూ వుండగా - మన అకాలీ సిక్కుగారు ఏనుగు మీంచి ఒక్కరే దిగారట. అదేమిటి అలా కబురుచేశారు స్వామీ అని ఆ వూరివారు అడగ్గా - ఒక పంజాబీ అకాలీ శిక్కుగారు సవా లక్షమంది మామూలు సర్దార్జీలకు సమానం అంటూ మీసం మెలేశార్ట.

అలాంటి సవాలక్ష శిక్కులలో ఈ మధ్య పంజాబీసుబా వేర్పాటుకోసం పోరాడిన తీవ్ర వాదులు మామూలువారికంటే యింకా ఎక్కువ వారయి వుంటారు.

స్వర్ణ దేవాలయం శిక్కులకు మాత్రమే కాదు భారత జాతి మొత్తానికి పవిత్ర స్థలం. అంచేత శిక్కు సోదరులకు తగిలిన ప్రతి గుండు దెబ్బా భారత మాతకు గుండెమీద దెబ్బ - సర్దార్జీలు లేని భారతాన్ని మనం వూహించుకోగలమా?